## 6

# కొలొస్సయుల కొరకైన పౌలు ప్రయాసము

## కొలొస్సయులకు 1:24-29

క్రీస్తు నిమిత్తమైన తన వ్యక్తిగత పరిచర్యలో పౌలు తీవ్రమైన వ్యతిరేకతను మరియు హింసలను ఎదుర్కొనవలసి వచ్చినది. గతములో నిగూఢమైన మర్మముగా మిగిలిపోయిన దేవుని యొక్క మర్మము ఇప్పుడు బయలుపరచబడినదని ఆయన తన సందేశముల ద్వారా ప్రజలకు తెలియజెప్పుచుండెను: క్రీస్తు మహిమ వారియందుండుటనుబట్టి అట్టి మహిమ నిరీక్షణను ఇప్పుడు అన్యజనులు సహితము కలిగియుండవచ్చును. ప్రతి ఒక్కరిని దేవుని యందలి పరిపూర్ణత లోనికి తెచ్చుట పౌలు పడిన ప్రయాసమంతటి సదుద్దేశమై యుండెను.

### పౌలు ఆనందము: కొలొస్సయుల కొరకు శ్రమలనుభవించుట (1:24)

**24ఇప్పుడు మీ కొరకు నేను అనుభవించుచున్న శ్రమల యందు సంతోషించుచు, సంఘము అను ఆయన శరీరము కొరకు, క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను.**

### "ఇప్పుడు మీ కొరకు నేను అనుభవించుచున్న శ్రమల యందు సంతోషించుచున్నాను" (1:24)

**ఇప్పుడు మీ కొరకు నేను అనుభవించుచున్న శ్రమల యందు సంతోషించుచున్నాను** అని పౌలు రచించాడు. యేసునకు సాక్షిగా పౌలు ఎన్నో శ్రమలు అనుభవించునని యేసు పౌలుకు తెలియజెప్పాడు (అపొస్తలుల కార్యములు 9:16). శ్రమలననుభవించుట ప్రీతికరమైన విషయము కాదు. ప్రసూతి సమయంలో ఒక తల్లి పడు బాధ ఎంతో తీవ్రమైనదై యుంటుంది, కానీ తన బిడ్డ ఈ లోకములోనికి రాబోవుచున్నాడని తెలియగానే ఆమె ఎంతో సంతోషిస్తుంది (యోహాను 16:21). ఆయనకు కలుగుచుండిన శ్రమలనుబట్టి పౌలు సంతోషించలేదు, కానీ అట్టి శ్రమలు కొలొస్సయులకు కలుగజేయు మేళ్లనుబట్టి ఆయన వాటియందానందించాడు. ఇటువంటి అభిప్రాయమునే ఆయన ఫిలిప్పీ పత్రికలో, ఆయన వారి నిమిత్తము ప్రాణాలర్పింపవలసి వచ్చినను, ఆయన సంతోషించునని చెప్పుట ద్వారా వ్యక్తంచేసాడు ఫిలిప్పీయులకు పత్రికలో, ఆయన వారి నిమిత్తము ప్రాణాలర్పింపవలసి వచ్చినను, ఆయన సంతోషించునను చెప్పుట ద్వారా వ్యక్తంచేసాడు (ఫిలిప్పీయులకు 2:17). ఆయనను వెంబడించువారు శ్రమలయందానందించవలెనని యేసు ఆశించాడు (మత్తయి 5:10–12; అపొస్తలుల కార్యములు 5:41; 16:25; యాకోబు 1:2 చూడుము). ఆయన సిలువ మీద మరణించుట గూర్చి యేసు చూపిన వైఖరి ఇదే (హెబ్రీయులకు 12:2).

కొలొస్సయుల కొరకు, పౌలు ఎలా శ్రమనొందుచుండినాడు? ఇది ఆయన వివరించలేదు.

పౌలు సహించుచుండిన హింసల గూర్చిన నివేదికలు వారి వరకు చేరియుండును. ఆయన అనుభవించుచుండిన శ్రమలు ఆయనను క్రీస్తు కొరకైన ఒక నాయకునిగా వ్యవస్థీకరించి యుండవచ్చును. ఆయన సహచరులు పౌలు ప్రకటించినంత ధైర్యంగా సువార్త ప్రకటించకపోవుటనుబట్టి కాబోలు వారు ఎల్లప్పుడు ఆయనతో కూడ హింసింపబడలేదు (అపొస్తలుల కార్యములు 14:19, 20). ఒక అపొస్తలుడుగాను, తోటి సహోదరులలో ఒక నాయకుడుగాను ఆయన అనుభవించుచుండిన శ్రమలమూలమున ఆయన అపొస్తలత్వ అధికారము ప్రధానము చేయబడినవాడై, క్రీస్తు యొక్క యథార్థమైన ప్రతినిధియై యున్నాడని వారు గుర్తించుదురు. ఇంకా, వారు ఎదుర్కొనుచుండిన తీవ్రమైన వ్యతిరేకతలో ఆయన చూపించిన మాదరి వారు యేసు యెడల విశ్వాసనీయులై నిలిచియుందునట్లు వారిని ప్రోత్సాహించును.

ఆయన తన విశ్వాసమందు విశ్వాసనీయుడైన నాయకుడైనందునుబట్టి, విశ్వాస ఆలంబనము కొరకు అనేకులు ఆయనపైనే ఆధారపడుచుండిరి, ఈ విషయము పౌలు అర్థంచేసికొనియుంటాడు. సాహసవంతుడుగాను, సహించుచున్నవాడుగాను ఉండుట ద్వారా, సువార్త నిమిత్తము ఆయన అనుభవించుచుండిన శ్రమల గూర్చి తెలిసికొనుచుండిన వారందరికి ఆయన మంచి మాదిరియై యుండినాడు. ఇట్టి శ్రమానుభవముల సమయంలో ఆయన కుప్పకూలిపోయినట్లయితే, అనేకులు నిరుత్సాపడుట మాత్రమే కాదు గాని ప్రభువైన క్రీస్తు యేసు నందలి విశ్వాసము నుండి తొలగిపోవుదురు. ఆయన చూపించుచుండిన మంచి మాదిరి ఇతరులకు ఎంతో గొప్ప ప్రోత్సాహము నిచ్చుచు, ఎంతటి కఠినమైన పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చినను వారు క్రీస్తునే హత్తుకొని యుండగల బలమును వారికి సమకూర్చుచుండినది. విల్యమ్ హెంద్రిక్సన్ ఇలా చెప్పుచున్నాడు, "ఎన్ని ఇబ్బందులను ఎదుర్కొనవలసి వచ్చుచుండినను ఆయన కనుపర్చుచుండిన సహనము, కొలొస్సయులను మాత్రమే గాక, వాస్తవమునకు సమస్త దేశములందలి సకల విశ్వాసులను సహితము విశ్వాసమునందు వారిని యింకా బలపర్చదా?"[1]

ఎడతెరిపిలేకుండా ఎదురౌచుండిన అపాయములో కూడ విశ్వసనీయముగా నిలిచియుండవలసినదేనని పౌలు కలిగియుండిన కట్టుదిట్టమైన కృతనిశ్చయత, ఇతరులు కూడ ఇటువంటి పరిస్థితులలో వారి విశ్వాసమునందు స్థిరముగా నిలిచియుండవచ్చునని వారికి తెలియజెప్పుచుండినది. ఆయన చెరసాలలో ఖైదీగా బంధింపబడి యుండినప్పటికిని ఆయన ప్రదర్శించిన విశ్వాస స్థిరత్వము మూలమున ఫిలిప్పీయులు ప్రయోజనము పొందియున్నారని ఆయన గుర్తించాడు. ఆయన ఎదుర్కొనుచుండిన పరిస్థితి "సువార్త మరి యెక్కువగా ప్రబలమగుటకే సమకూడినదనియు" "సహోదరులైన వారిలో ఎక్కువ మంది ఆయన బంధకముల మూలముగా ప్రభువునందు స్థిరవిశ్వాసము గలవారై, నిర్భయముగా దేవుని వాక్యము బోధించుటకు మరి విశేష ధైర్యము తెచ్చుకొనిరని" ఆయన రచించాడు (ఫిలిప్పీయులకు 1:12, 14).

**"సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నావంతు నా శరీరమందు, సంపూర్ణము చేయుచున్నాను" (1:24)**

ఆయన అనుభవించిన శ్రమలనుబట్టి పౌలు, **సంఘము అను ఆయన శరీరము కొరకు**

**క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నా వంతు నా శరీరమందు, సంపూర్ణము చేయుచున్నాను** అని ధైర్యంగా చెప్పగలిగాడు. ఆయన అనుభవించుచుండిన శ్రమలను ఆయన కేవలము కొలొస్సయుల కొరకు మాత్రమే కాదు, కానీ సంఘమను క్రీస్తు శరీరమంతటి కొరకు అనుభవించుచుండెను. అయన జీవిత విధానమును బట్టి కాదు, కానీ ఆయన క్రీస్తు నిమిత్తము అంకితభావముతో జీవించుచుండిన జీవితము మరియు క్రీస్తు శరీరమను సంఘమునకు ఆయన చేయుచుండిన పరిచర్యనుబట్టి ఇతరులు ఆయనకు ఇబ్బందులు కలిగించుచుండిరి.

"నా శరీరమందు" (*en tē sarki mou*) అని ఆయన చెప్పినప్పుడు, ఆయన యొక్క అంతరంగ పురుషునికి ఒక ఆలయముగా ఉంటున్న తన భౌతిక కాయము గూర్చి మాట లాడుచుండెనని పౌలు భావించాడు (2 కొరింథీయులకు 4:16; 5:1, 4). ఆయన శరీరము స్వతస్సిద్ధముగా పాపిష్ఠియైనదై యున్నదని ఆయన ఎంచలేదు, ఈ విషయమును జ్ఞానతత్వవాదులు అటుతరువాత దినములలో బోధించారు.

ఆయన క్రీస్తు నంగీకరించునంత వరకు, ఇతరుల నుండి పౌలు ఎటువంటి దూషణనైనను ఎదుర్కొనలేదు. ఏదిఏమైనా, క్రీస్తు అనుచరుడైన తరువాతనే ఆయన దాదాపుగా ప్రతినిత్యము హింసలు ఎదుర్కొన్నాడు, వాటిని భరించాడు. ఆయన తన సొంత పాపములనుబట్టి శ్రమలు అనుభవించలేదు. ఆయన ఎదుర్కొనుచుండిన ఇక్కట్లు ఒక ప్రక్క ఆయన దేవుని యందలి సహాయములో మెండుగాను నిండుగాను విశ్వాసముంచునట్లు ఆయనకు తోడ్పడుచుండగా, మరొక ప్రక్క అవి క్రీస్తు శరీరమునకు అనగా సంఘమునకు సహితము ప్రయోజనకరమైనవై యుండినట్లు ఋజువుచేయబడినది. గనుక ఆయన ఇతరులెవరును వ్యాపింపజేయలేక పోయినంతగా సువార్తను విస్తరింపజేసాడు, తత్ఫలితంగా సంఘము దాదాపుగా రోమా సామ్రాజ్యమందంతటను అంతకంతకు అభివృద్ధిచెందుచుండెను. ఆయన ఎన్నో కష్టములను ఎదుర్కొనుచుండినప్పటికిని వాటన్నిటిని సహించుచునే ముందుకు సాగుటకు పడిన సకల ప్రయాసములకు ఫలితంగా, ఆయన పయనించిన ప్రతి చోట సంఘములు పుట్టగొడుగుల్లా పుట్టుకొనివచ్చుచుండెను మరియు, పౌలు ప్రబోధముల చేత బలపర్చబడుచుండెను. క్రీస్తు శరీరము పక్షమున ఆయన చేపట్టిన పరిచర్య సంఘ సమాజములను బలముగా నిర్మించుచు, ప్రపంచమందంతటను నూతనముగా సంఘముల సంస్థాపనకై ఉద్దేశింపబడినదై యుండెను. ఇంతేగాక, సంఘముల గూర్చి తగు శ్రద్ధ వహించునట్లు కూడ పౌలు యింకా ఎన్నో శ్రమలను సహించాడు (2 కొరింథీయులకు 11:28).

పౌలు అనుభవించుచుండిన హింసలు అప్పుడప్పుడు ఆయన తన ఆత్మలో అత్యంత తీవ్రముగా బాధననుభవించునట్లు చేయునదై యుండినవి. జీవితముపై విరక్తి కలిగి, బ్రదుకుట కంటే చావడమే మేలని అనుకొనునంతగా ఆయన శ్రమనొందాడు (2 కొరింథీయులకు 1:8, 9; 6:4, 5; 11:23–27). వ్యతిరేకతను మరియు క్రూరమైన హింసలను ఎదుర్కొంటూనే పౌలు దేవుని వాక్యము బోధించుచుండినప్పుడు ఆయన అంతర్యములో ఏయే పోరాటములు పెనుగులాడుచుండినవో ఆయన ఎటువంటి శారీరక బాధను అనుభవించాడో క్రైస్తవులు ఎన్నటికిని తెలిసికొనలేరు. అయన ఏమేమి సహించవలసి యుండునో అను విషయమునకు సంబంధించినంత వరకు యేసు అదివరకే ఆయనను హెచ్చరించుచు ఎట్టి పరిస్థితులలోనైనను ఆయన భయపడవలసిన అవసరంలేదని ఆయనను మందలించాడు (అపొస్తలుల కార్యములు

9:16; 18:9, 10; 1 కొరింథీయులకు 2:1–3).

సువార్త వ్యాపకము నిమిత్తము శ్రమలను అనుభవించుట ద్వారా, ఆయన క్రీస్తు శ్రమలలో పాలు పంచుకొనుచుండెను. క్రీస్తు నిమిత్తము ఇతరులు ఇంత కంటే ఎక్కువ శ్రమలే సహించవలసి యుండునేమో; యేసు అనుచరులు అంత్య కాలము వరకు కూడ శ్రమలు ఎదుర్కొనవలసి యుండునని ఎరిగినవారై యుండవలెను. యేసు ఆరోహణుడై పరలోకమునకు వెళ్లిపోయిన తరువాత, యేసు తన పరిచర్యను ఎక్కడ వదిలిపెట్టాడో అక్కడ నుండి పౌలు చేపట్టాడని ఒక విధంగా చెప్పుకొనవచ్చును. పౌలు యేసు మాదిరిని అనుకరించుచు (1 పేతురు 2:21), సహనమునకు సరిపడు మాదిరిగా నిలిచియుండుటకు కొనసాగుచుండెను.

### "క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను" (1:24)

"సంపూర్ణము చేయుచున్నాను" అని అనువదింపబడిన పదము (*antanaplēroō*) క్రొత్త నిబంధనలో ఇచ్చట మాత్రమే కనిపించును. **కొదువైన వాటియందు ... సంపూర్ణము చేయుచున్నాను** అని వ్రాయుటలో, సర్వలోకములోని సర్వసృష్టికి సువార్తను వ్యాపింపజేయుటకు యేసు చేపట్టిన పనులను ఆయన మాత్రమే సంపూర్తిచేయుచున్నాడని పౌలు భావించలేదు. ఇట్టి ప్రయాసములో ఆయన తన వంతును సంపూర్ణము చేయుచుండెనని భావించాడు.

"పాట్లు" (*thlipseis*) అను పదమునకు "శ్రమలు" (*pathēmata*) అను అర్థముగాక వేరొక అర్థమున్నది, అది ఈ వచనంలో దీనికి ముందు కనిపించినది. "శ్రమలు" అను మాటకు సరిపడు పదము సాధారణంగా దూషింపబడుట ద్వారా కలుగు భాదను తెలుపుచు, క్రీస్తు సిలువను సూచించును (2 కొరింథీయులకు 1:5; హెబ్రీయులకు 2:9, 10). "పాట్లు" అను పదము గూర్చి హెచ్. సి. జి. మోల్ ఇలా వ్రాయుచున్నాడు,

> ధన్యుడైన యేసు ప్రభువు యొక్క అనుభవములకు సంబంధించినంత వరకు ఈ పదము (క్రొత్త నిబంధనలో) మరెక్కడైనను వాడబడలేదు, అయితే అది క్రీస్తు సిలువవేయబడుటకు సంబంధించిన ప్రవచనాత్మక కీర్తనలో కనబడును [కీర్తనలు 22; LXXలో 21]. దాని యొక్క సామాన్య రిఫరెన్సు మరణమునకు సంబంధించిన నొప్పులను గూర్చినది కాదు, కానీ హింసల వలని పాట్లు మరియు వేదనకు సంబంధించినదై, సాధారణంగా భారభరితమైన జీవితము యొక్క పరీక్షలను సూచించును.[2]

అటుతరువాతి వచనములలో, పౌలు తన పరిచర్య గూర్చి చర్చించాడు, "పాట్లు" అను పదమునకు తన భావమేమైయున్నదో నిశ్చితమైన అవగాహన కలుగజేసాడు. తన పరిచర్యకు ఫలితంగా, కష్టాలను మరియు శ్రమలను ఆయన సహించాడు (2 కొరింథీయులకు 1:4–8; 2:4; 4:8, 17; 7:4, 5; ఫిలిప్పీయులకు 4:14; 1 థెస్సలొనీకయులకు 3:4, 7). ఆయన ఈ విషయములను కొంత మేరకు 2 కొరింథీయులకు 11:23–30లో వర్ణించాడు. క్రైస్తవులు సహించుచుండిన పాట్ల గూర్చి కూడా ఆయన రచించాడు (2 కొరింథీయులకు 1:4; 8:2, 13; 2 థెస్సలొనీకయులకు 1:4, 6, 7).

పౌలు క్రీస్తు పడిన "పాట్ల" గూర్చి (బహువచనం) మాటలాడినప్పుడు, సిలువ వలన కలుగుచుండిన భాదను మించి ఆయన భావించాడు. పౌలు అనుభవించిన శ్రమలు,

యేసు సిలువ మీద అనుభవించిన శ్రమలకు భిన్నమైనవై యుండుట మాత్రమే కాదు గాని అవి అనుభవించుటలో నుండిన ఉద్దేశము సహితము భిన్నమైనదై యుండినది. యేసు విషయంలోనైతే ఆయన తన వ్యక్తిగత పరిచర్యలో తిరస్కారము మరియు వ్యతిరేకత నడుమ ఆయన మానవుడుగా భారములు, పాట్లు, అవమానము, మరియు ప్రయాసములు అనుభవించాడని పౌలు భావించుచుండెను (హెబ్రీయులకు 12:3, 4). సువార్తను వ్యాపింపజేయగోరువారు సహితము ఇటువంటి పరీక్షలను మరియు వ్యతిరేకతను సహించవలసి యుండునని ఆశించవచ్చును. పౌలు యేసు యెడల చేసిన పరిచర్యనుబట్టియే, "క్రీస్తు యొక్క శ్రమలు మాయందేలాగు విస్తరించుచున్నవో ..." అని ఆయన వ్రాయగలిగాడు (2 కొరింథీయులకు 1:5). "యేసు యొక్క మరణానుభవము" (2 కొరింథీయులకు 4:10) మరియు "యేసు యొక్క ముద్రలు" (గలతీయులకు 6:17) తన శరీరమందున్నవని పౌలు చెప్పాడు. "ఆయన శ్రమలలో పాలివాడనగుట యెట్టిదో యెరుగుట" పౌలు లక్ష్యమై యుండినది (ఫిలిప్పీయులకు 3:10).

యేసు పొందిన పాట్లు దేవుని వాక్యమును ప్రకటించిన వారనుభవించాల్సిన శ్రమలకు ప్రారంభము మాత్రమే అయియుండినవి. ఆయన ఆరోహణుడై పరలోకమునకు వెళ్లిన తరువాత, ఆయన పాట్లు ఆయనను వెంబడించువారితో కొనసాగుచుండును. సువార్తను ప్రకటించుటకు యేసు ఇహమందు నిలిచియుండి యున్నట్లయితే, ఆయన మరి ఎక్కువ శ్రమలను మరియు వ్యతిరేకతను సహించవలసినవాడై యుండెను. దానికి బదులుగా, ఆయన కార్యములు కొనసాగుచు ఆయన ఆరంభించినవి ముగించబడునట్లు ఆయనను వెంబడించువారు దూషణలు సహించవలసి యున్నది. సువార్త ప్రకటింపబడుచుండునంత కాలము, వ్యతిరేకత కొనసాగుచునే యుండును.

> ఈ విధంగా పౌలు, క్రీస్తు శరీరము అనగా, సంఘము నిమిత్తము, యింకను కొదువయైయుండు దానిని నెరవేర్చుచున్నాడు. ఆయన ఈ పనిని తన మాటల్లో మాత్రమే కాదు, కానీ తన శరీరములో, ఆనగా తన సొంత, భౌతిక కాయములో అనుభవించుచున్నాడు. గనుక ఇది నిజముగా "క్రీస్తు శ్రమలలో పాలివాడగుట," క్రీస్తు నిమిత్తము కష్టములు అనుభవించుట ఔతుంది; గనుక కొలొస్సయులు మరియు ప్రపంచమందంతటను గల విశ్వాసుల విశ్వాసము దాని సంపూర్ణ సిద్ధినొందునట్లు సువార్త ప్రకటన మరి ఎక్కువ కార్యసార్థకమైనదై యుండుటకు ఈ కష్టములు మాత్రమే దోహదంచేయగలవు.[3]

"క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు" తన వంతు తన శరీరమందు సంపూర్ణము చేయుచున్నాడని చెప్పుట ద్వారా, యేసు మరణము, దాని సంపూర్ణము చేయుటకు అదనపు శ్రమలు అవసరమై యుండిన "చాలని" (కొదువయై యుండిన) బల్యర్పణయై యుండినదని పౌలు భావించలేదు. సమాధానపరచబడుటను యేసు తన మరణం ద్వారా సాధ్యం చేసాడనియు (వచనాలు 20–22) గనుక క్రైస్తవులు క్రీస్తు నందు సంపూర్ణులై యున్నారనియు (2:10) పౌలు వివరించాడు. యేసు చేసిన ఒకే అర్పణము ఆయనను పరిపూర్ణుడు, "సంపూర్ణ సిద్ధి పొందిన" (హెబ్రీయులకు 5:8, 9), మరియు చాలినవానిగా చేసినది. ఆయన బల్యర్పణ లోకమందున్న సమస్త మానవాళి పాపములకు చాలిన బల్యర్పణయై యున్నది (1 యోహాను 2:2). ఒక్క బల్యర్పణ చేత (హెబ్రీయులకు 7:27; 9:26–28; 10:10–14), సమస్త మానవ జాతి రక్షణార్థమై అవసరమైయుండిన సమస్తమును ఆయన సమాప్తము చేసాడు.

## వారికి మర్మము బయలుపరచబడింది (1:25-27)

**[25]దేవుని వాక్యమును, అనగా యుగములలోను తరములలోను మరుగు చేయబడియున్న మర్మమును సంపూర్ణముగా ప్రకటించుటకు, మీ నిమిత్తము నాకు అప్పగింపబడిన దేవుని యేర్పాటు ప్రకారము, నేను ఆ సంఘమునకు పరిచారకుడనైతిని. అన్యజనులలో ఈ మర్మము యొక్క మహిమైశ్వర్యము ఎట్టిదో అది, అనగా మీ యందున్న క్రీస్తు, మహిమ నిరీక్షణయై యున్నాడను సంగతిని దేవుడు తన పరిశుద్ధులకు తెలియపరచగోరి యిప్పుడు ఆ మర్మమును వారికి బయలుపరచెను.**

### "నేను ఆ సంఘమునకు పరిచారకుడనైతిని" (1:25)

నేను **ఆ సంఘమునకు పరిచారకుడవైతివి** అని (*diakonos,* "ప్రతినిధిగా, మధ్యస్థుడు, వార్తావహుడు")[4] పౌలు తనను గూర్చే పరోక్షంగా ప్రస్తావించుచున్నాడు. "సంఘము" అను పదము గ్రీకు వాక్యభాగములోని 25వ వచనంలో కనిపించదు, కానీ అది దానిని గూఢంగా తెలుపుతున్నవి. ఈ సందర్భములో ఆయనకు ఒక పరిచారకుని (డీకను) హోదా ఉండినదని పౌలు తనను గూర్చి ప్రస్తావించుకొనలేదు; దానికి బదులుగా, ఈ బాధ్యత యేసు చేత అప్పగింపబడిన క్రీస్తు దాసుడైయున్నాడని ఆయన తెలియజెప్పాడు. ఆయన సంఘమునకు మాత్రమే ఒక దాసుడు కాదు, కానీ సువార్తకు ఒక "పరిచారకుడై యున్నాడని" చెప్పాడు (వచనం 23).

పౌలు దమస్కుపట్టణమునకు పయనమై వెళ్లుచుండగా యేసు ఆయనకు ప్రత్యక్షమైనప్పుడు, ఆయన ఒక "పరిచారకుడై" (*hupēretēs*; అపొస్తలుల కార్యములు 26:16) యుండుటకు నియమింపబడినాడని యేసు పౌలుకు తెలియజెప్పాడు. పౌలు యేసునకు చేసిన పరిచర్య గూర్చి యిదే పదము 1 కొరింథీయులకు 4:1లో ప్రయోగింపబడనది. ఇదే విధంగా, జాన్ మార్కు (అపొస్తలుల కార్యములు 13:5); దాసులు లేక ఉపచారులు (లూకా 1:2; 4:20); మరియు అధికారుల (మత్తయి 5:25; 26:58; యోహాను 7:32; 18:3) విషయంలో కూడ ఈ పదము వాడబడినది.

ఆయన యేసుకు మాత్రమే కాదు, కానీ సంఘమునకు సహితము పరిచర్య చేయుచున్నాడని పౌలు ఈ వాక్యభాగములో వివరించాడు. ఏదిఏమైనా, సంఘ అవసరతలను తీర్చు విషయంలో పరిచర్య చేయుట ద్వారా, ఆయన యేసుకు పరిచర్య చేయుచున్నాడు. వారు తోటి క్రైస్తవులలో నుండి తమ్మునుతాము వేరుచేసికొని వారికి దూరమైనప్పుడు, క్రైస్తవులు యేసును సరైన విధంగా సేవించుచున్నవారై యుండరు. "మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మితో చెప్పుచున్నాను" అని యేసు ప్రభువు సెలవిచ్చాడు (మత్తయి 25:40).

### "దేవుని యేర్పాటు (గృహనిర్వాహకత్వము) ప్రకారము" (1:25)

తండ్రి మరియు కుమారుడు ఒకరితో నొకరు కలిసి పనిచేయుచుందురు. వాని గృహనిర్వాకత్వమును కోల్పోనైయుండిన అన్యాయస్థుడైన గృహనిర్వాహకుని గూర్చిన ఉపమానములో, యేసు **గృహనిర్వాహకత్వము** (*oikonomia*) గూర్చిన, మరొకరి

యెడల చేయబడు సేవ విషయంలో నున్న బాధ్యతాయుతమైన ఒక హోదాను గూర్చిన, అభిప్రాయమును ఉపయోగించాడు (లూకా 16:1–4, 8). *oikonomia* యొక్క మూల పదముల రూపముల "గృహనిర్వాహకుడు" లేక "గృహనిర్వాహకత్వము" అనియు (లూకా 12:42; 1 కొరింథీయులకు 9:17; ఎఫెసీయులకు 3:2; తీతు 1:7; 1 పేతురు 4:10); "ఖజానాదారుడు" (రోమీయులకు 16:23) అనియు; "నిర్వాహకులు" (గలతీయులకు 4:2); మరియు "యాజమాన్యము" (ఎఫెసీయులకు 1:10; 1 తిమోతి 1:4) అనియు అనువదింపబడినవి.

సువార్తను విస్తరింపజేయాల్సిన బాధ్యతను యేసు పౌలుకు అప్పగించాడు. ఇట్టి బాధ్యతను నమ్మకముగా నిర్వర్తించుచుండిన విషయంలో, తన జీవితము, సమయము, ఆస్తిపాస్తులు, మరియు సకల సామర్థ్యములు యేసునకే చెందియున్నవి గనుక అవి ఆయన సేవ నిమిత్తమే వాడబడవలెనని ఆయన ఎంచాడు. ఆయన యేసుకు చెందిన విషయాల గూర్చి ఒక గృహనిర్వాహకుడై యున్నాడని తనను తాను ఎంచుకొన్నాడు. ఈ హేతువునుబట్టియే, ఆయన తనకు అప్పగింపబడిన దానిని నిర్వహించుటలో విశ్వసనీయమైనవాడుగా నుండుట ఎంతైనా ముఖ్యమైన విషయమై యున్నదని ఆయన భావించాడు (1 కొరింథీయులకు 4:1, 2). ఆయన యేసుకు తన లెక్క ఒప్పజెప్పవలసి యున్నదని గ్రహించినందు వలన (2 కొరింథీయులకు 5:10), ఆయన మనుష్యులను కాదు, కానీ దేవునినే సంతోషపర్చుటకు ప్రయత్నించాడు (గలతీయులకు 1:10–12).

### "దేవుని వాక్యమును, ... సంపూర్ణముగా ప్రకటించుటకు, మీ నిమిత్తము నాకు అప్పగింపబడిన ..." (1:25)

పౌలు తన గృహనిర్వాహకత్వము గూర్చి అది తన సొంత ప్రయోజనము కొరకే అయియున్నదను భావంతో చొరవ తీసికొనలేదు. దేవుని చిత్తప్రకారము యేసు ఆ బాధ్యతను పౌలుకు అప్పగించాడు.[5] ఆయన గృహనిర్వాహకత్వము మొదట యూదుల గూర్చినదై యుండినది (రోమీయులకు 1:16; అపొస్తలుల కార్యములు 13:14–16; 14:1; 17:1 చూడుము); అటుతరువాత అది అన్యజనుల గూర్చినదై యుండినది (రోమీయులకు 11:13; గలతీయులకు 2:8, 9). పౌలు బాధ్యత ప్రత్యేకించి వారి కొరకు మాత్రమే ఉద్దేశింపబడినది కానప్పటికిని, అట్టి బాధ్యతాయుతమైన ఈ జాబితాలో కొలొస్సయులు కూడా చేరియుండిరి.

ఆయన కలిసికొనిన ఎవరికైనా సరే, యేసు సందేశమంతటిని సంపూర్ణముగా నివేదించవలెననునది పౌలుకు అప్పగింపబడిన బాధ్యతాయుతమైన గృహనిర్వాహకత్వము యొక్క ప్రధానోద్దేశమై యుండినది. గనుక ఆయన ఈ కార్యభారమును శ్రద్ధతో నిర్వహించాడు. "ప్రయోజనకరమైనది ఏదియు దాచుకొనక బహిరంగముగాను, ఇంటింటను మీకు తెలియజేయుచు, బోధించుచుంటిని ..."; "దేవుని సంకల్పమంతయు మీకు తెలుపకుండ నేనేమియు దాచుకొనలేదు" అని ఆయన ఎఫెస్సు పట్టణంలోని సంఘపెద్దలకు తెలియజెప్పాడు (అపొస్తలుల కార్యములు 20:20, 27).

కొలొస్సయులకు వ్రాయబడిన పత్రికలో **దేవుని వాక్యము** అని వ్రాయబడిన స్థలము ఇదొక్కటే. ప్రయోగింపబడిన ఇతర పదజాలములలో, "సువార్త సత్యము" (1:5), "క్రీస్తు

వాక్యము" (3:16), మరియు "వాక్యము" (4:3) కలవు. యేసు, తండ్రి నుండి పొందిన వాక్యమును క్రొత్త నిబంధన రచయితలకు పరిశుద్ధాత్మ ద్వారా (యోహాను 14:26; 16:13-15; ఎఫెసీయలకు 3:3-5) బయలుపర్చాడు (యోహాను 12:49, 50; 17:8).

దేవుని వాక్యమును ప్రకటించుట పౌలుకు అత్యంత ప్రాముఖ్యమైన అంశమై యుండినది, ఆయన తిమోతిని మందలించుచున్న తీరులో దీనిని మనము గమనించవచ్చును (2 తిమోతి 4:2). పౌలు ప్రబోధించినది మరియు ప్రకటించినది కూడా "దేవుని వాక్యమే."[6]

### "అనగా యుగములలోను తరములలోను మరుగుచేయబడియున్న మర్మము ..." (1:26)

**మర్మము** (*mustērion*) అనగా, అది బయలుపరచబడునంత వరకు దాచబడి గ్రహించలేనిదై యున్న ఒక సత్యమై యున్నది. జే. బి. లైట్ ఫుట్ ఇలా చెప్పుచున్నాడు, "... 'ఒకప్పుడు దాచబడి యుండినది కానీ ఇప్పుడు బయలుపరచబడి యున్న ఒక సత్యమును,' 'ప్రత్యేకమైన ప్రత్యక్షత లేకుండినట్లయితే అది తెలియబడనిదిగానే మిగిలి యుండెడి ఒక సత్యమును' ఈ పదము సామాన్యముగా తెలుపుచున్నది."[7] అది అర్థమవకుండా నిగూఢంగానే మిగిలియున్నది లేక కనుగొనబడజాలనిదై యున్న ఒక విషయమై యున్నదని దాని అర్థం. పాత నిబంధనలోని కొన్ని ప్రవచనాత్మక పలుకులు, క్రొత్త నిబంధన బయల్పాటు యొక్క సహాయము లేకుండా, ముసుగువేయబడిన మర్మములుగా నిలిచియుండేవే, ఎన్నటికినీ అర్థంకానివిగానే ఉండేవి (2 కొరింథీయులకు 3:14).

పరలోక రాజ్యమును గూర్చిన మర్మములను తెలిసికొనుట, జనసమూహములకు కాదు, కానీ వారికి అనుగ్రహింపబడియున్నదని యేసు తన శిష్యులతో చెప్పాడు (మత్తయి 13:11). రక్షణకు సంబంధించిన దేవుని ప్రణాళికను మరియు యేసు క్రీస్తు ద్వారా దేవుడు మానవులకు అనుగ్రహించు ఆశీర్వాదముల గూర్చి ప్రస్తావించుచుండిన సందర్భములో పౌలు ఇదే పదమును ప్రయోగించాడు.[8] దేవుడు అన్యజనులను మరియు యూదులను కూడ ఒకే శరీరము, అనగా సంఘము యొక్క సభ్యులనుగా అంగీకరించుననునది మర్మములోని ప్రధాన భాగమై యుండినది (ఎఫెసీయులకు 3:3, 6).

యేసు ఇహమునకు రాక మునుపు, క్రీస్తును గూర్చి పాత నిబంధనలో ఉండిన ప్రవచనములు **యుగములలోను తరములలోను మరుగుచేయబడి యుండినవి.** దేవుడు, వాటి భావములను తన చిత్తప్రాకారముగా బయలుపర్చవలెనని నిర్ణయించుకొనిన కాలము సంపూర్ణమైనప్పుడు వాటిని బయలుపరచునంత వరకు, అవి ముసుగువేయబడినవై యుండినవి. పౌలు దీని గూర్చి ఎఫెసీయులకు 3:3-5లో పరోక్షంగా ప్రస్తావించాడు. ఆయన రచించిన విషయములను చదువుట ద్వారా మనము "పూర్వ కాలమందలి" మర్మమును అర్థంచేసికొనగలమని ఆయన తెలియజెప్పాడు.

పాత నిబంధనలో లిఖితమై యున్న ప్రవచనాత్మక పలుకులను గ్రహించుటకు మరి ఎక్కువ ప్రత్యక్షతల అవసరమున్నదని తెలియజేయుటకు ఐతియోపీయుడైన నపుంసకుడు ఒక చక్కని ఉదాహరణమై యున్నాడు. యెషయా గ్రంథం ఏబది మూడవ అధ్యాయంలో యేసు గూర్చి ఏమని వ్రాయబడి యుండినదో ఫిలిప్పు ఆయనకు వివరంగా తెలియజెప్పునంత వరకు ఆయన విషయమేమిటో గ్రహించలేదు (అపొస్తలుల కార్యములు 8:30-39).

యేసు గూర్చిన ప్రవచనములు మరియు ఆయన రాకడకు సంబంధించిన సంఘటనలు ప్రపంచ చరిత్రలో ఆదియందే ఆరంభమాయ్యాయి. ధర్మశాస్త్రము ఇవ్వబడక మునుపు మరియు ఇవ్వబడిన తరువాత యేసు క్రీస్తు రాకడకు సుమారు, 1,500 సం॥ల సమయంలో, ఆయనను గూర్చి అనేక ప్రకటనలు వెలువడినవి. అయన తన జీవితము మరియు ఉపదేశముల చేత పాత నిబంధనలోని ప్రవచనముల పటమును క్రోడీకరించుట ద్వారా యేసు సహాయం చేసేంత వరకు, వాటిని గ్రహించుట అతి కష్టంగా, దాదాపుగా అసాధ్యమైనదిగా ఉండినది (లూకా 24:44). నిజముగా దేవుడు చేసిన సమస్త ప్రజల రక్షణ ప్రణాళికలో యేసు వహించిన పాత్ర అనేకమైన గత తరములకు అర్థంకాకుండా వారి నుండి దాచబడిన ఒక మర్మమై యుండినది.

**"తన పరిశుద్ధులకు తెలియపరచబడినది" (1:26)**

మర్మము, గతములో దాచబడి యుండినది, కానీ ఇప్పుడు తెలియపరచబడినది. దేవుడు తన చిత్తప్రకారముగా కాలము సంపూర్ణమైనప్పుడు దానిని బయలుపర్చాడు (గలతీయులకు 4:4). గనుక ఇప్పుడది అర్థంచేసుకొగల సత్యమై యున్నది.

ఆ మర్మములో దాచబడి ముసుగువేయబడినదై యుండిన ప్రధాన సువర్తమానము యేసే అయియుండెను (1 తిమోతి 3:16; ఎఫెసీయులకు 3:4–6). ఆయన రాకడ ఇశ్రాయేలును దీవించుట మాత్రమే కాదు, కానీ అది అన్యజనులతో సహా, సమస్త జనులను దీవించును. ఈ సత్యమును పాత నిబంధనలోని అసంఖ్యాకమైన ప్రకటనలు సూచించినవి.[9]

క్రొత్త నిబంధన ద్వారా, మర్మము పరిశుద్ధులకు తెలియపరచబడినది. సువార్త బయలుపరచిన మర్మములు తెలిసికొనలేకపోయినది కొలొస్సయులు మాత్రమే కాదు, ఏలయనగా ఇప్పుడది ప్రపంచ నలుమూలల్లో చాటింపబడగలదు (మార్కు 16:15). మర్మమును గ్రహించినవారు దేవుని పరిశుద్ధులై యున్నారు. అది వారికి వ్యక్తిగతముగాను, సూటిగాను బయలుపరచబడలేదు. ఈ మర్మము పరిశుద్ధాత్మ ద్వారా అపొస్తలులకును ప్రవక్తలకును బయలుపరచబడినది (ఎఫెసీయులకు 3:3–5). వారు, తిరిగి, వారికి బయలుపరచబడిన దానిని వారికి పరిశుద్ధాత్మ చేత బోధింపబడిన మాటల్లో ఇతరులతో పంచుకొనిరి (1 కొరింథీయులకు 2:9–13).

1 కొరింథీయులకు 2:14, 15 ఆధారంగా, పరిశుద్ధాత్మ సహాయము లేకుండా ఈ రోజుల్లో దేవుని వాక్యము గ్రహింపబడజాలదని కొందరు వారి అభిప్రాయమును అభివ్యక్తము చేసారు. క్రైస్తవేతరులు దేవుని వాక్యమును అర్థం చేసికొనలేకపోతున్నారని పౌలు చెప్పలేదు. కానీ, ఆత్మ సంబంధమైన విషయములను "సహజ మానవుడు" అంగీకరించడు ఏలయనగా అవి వానికి వెఱ్ఱితనముగా ఉన్నవని పౌలు వ్రాసాడు. వానికి సంబంధించినంత వరకు ఈ విషయములు వానికి వెఱ్ఱితనముగా ఉన్నవి గనుక వాడు ఆత్మీయ సంగతులను సరైన మనస్తత్వంతో అర్థంచేసికొనుటకు ముందుకు రాడు (1 కొరింథీయులకు 1:18, 23).

నశించినవారి చేత దేవుని వాక్యము గ్రహింపబడనట్లయితే, వారు దానిని చదువాల్సిందే లేదా బోధింపబడుచుండగా వినాల్సిందేననుటకు ఏ హేతువైనను మిగులదు. నశించినవారికి సువార్త (ఎఫెసీయులకు 1:13) తప్పనిసరిగా ప్రకటించ వలసినదే ఏలయనగా వారి రక్షణార్థమైన ఒకే ఒక మూలము దాని సందేశములో కలదు (అపొస్తలుల కార్యములు

11:14; రోమీయులకు 1:16). ఏదిఏమైనా, నశించినవారందరు దానిని అంగీకరించరు ఏలయనగా ఆధ్యాత్మిక విషయాల గూర్చి వారిలో అనేకులకు ఎటువంటి ఆసక్తియైనను లేదు (మత్తయి 7:13, 14).

### "అన్యజనులలో ఈ మర్మము యొక్క మహిమైశ్వర్యము ఎట్టిదో ... అను సంగతిని దేవుడు ... తెలియపరచగోరెను" (1:27)

**అన్యజనులు** (*ethnē,* ఈ పదము నుండి "ఎత్నిక్" "ethnic" అను అంగ్ల పదము పుట్టుచున్నది) అనగా "ప్రజా గుంపులు" లేక "జాతులు" అని అర్థము. వారు దేవుని ఒకే నిజమైన జనులని ఇశ్రాయేలీయులు తమ్మునుతాము ఎంచుకొన్నారు. ప్రపంచమందలి మిగిలిన ప్రజలు, "జనములు" – అనగా, అన్యజనులు, దేవుని ప్రజలు కానివారి గుంపులో చేరియుండిరి (లేవీయకాండము 26:45; యెహెజ్కేలు 5:8 చూడుము). దేవుని ప్రణాళిక ప్రకారము, ఏదో ఒక దినాన అన్యజనులు సహితము ఆయన జనులుగా అంగీకరింపబడుదురనునది ఇశ్రాయేలీయులు అర్థంచేసికొనని మర్మమై యుండినది. లేఖనములను చదువుట ద్వారా వారి నేత్రములకు గ్రుడ్డితనము కలుగజేయబడి యుండినట్లయితే (2 కొరింథీయులకు 3:14 చూడుము) ఇశ్రాయేలీయులు ఈ విషయాన్ని అర్థం చేసికొని యుందురు. కేవలము ఆయన సంతతివారు మాత్రమే కాదు. సమస్త వంశములు సహితము, అతని సంతానము ద్వారా ఆశీర్వదింపబడునని, దేవుడు అబ్రాహామునకు వాగ్దానమిచ్చాడు (ఆదికాండము 12:3; 22:18). ఇశ్రాయేలు జనాంగము ద్వారా, దేవుడు ప్రజాగుంపుల చేత ఘనముగా స్తుతింపబడును (కీర్తనలు 18:49; 117:1).

**మహిమైశ్వర్యము** అనునది లెక్కలేనన్ని పర్యాయములు పౌలు చేత వ్యక్తము చేయబడిన ఒక భావనయై యున్నది (రోమీయులకు 9:23; ఫిలిప్పీయులకు 4:19 చూడుము). "ఐశ్వర్యము" అను పదమును పౌలు క్రైస్తవులపై కుమ్మరింపబడు ఆశీర్వాదములకు అన్వయించాడు (రోమీయులకు 2:4; ఎఫెసీయులకు 1:7).

### "అనగా మీ యుందున్న క్రీస్తు, మహిమ నిరీక్షణయై యున్నాడను సంగతి" (1:27)

పౌలు చర్చించుచుండిన ఈ మర్మము యొక్క మహిమకు సంబంధించిన ఐశ్వర్యమును తరువాతి పదజాలము గుర్తించుచున్నది: **అనగా మీ యుందున్న క్రీస్తు, మహిమ నిరీక్షణయై యున్నాడను సంగతి.** మహిమను గూర్చి కొలొస్సయులు కలిగియుండిన నిరీక్షణ వారి అంతరంగములో క్రీస్తు నివసించియుండుటపై ఆధారపడి యుండినది. అంతరంగములో క్రీస్తు నివసించి యుండుట గూర్చిన భావము క్రొత్త నిబంధనలో మరి కొన్ని చోట్ల కూడ అగుపించుచున్నది (యోహాను 17:23; రోమీయులకు 8:10; 2 కొరింథీయులకు 13:5; గలతీయులకు 2:20; 4:19). ఆయన వాక్యమును ప్రేమించుచు దానికి లోబడుచుండువారిలో ఆయన మరియు తండ్రి నివాసమేర్పరచుకొని యుందురని యేసు వాగ్దానమిచ్చాడు (యోహాను 14:23). విశ్వాసము ద్వారా క్రీస్తు క్రైస్తవులలో నివసించి యుండును (ఎఫెసీయులకు 3:17). పరిశుద్ధాత్మ క్రీస్తు **ఆత్మయై** యున్నాడు, ఒకని ద్వారా పనిచేయుచుండుటకు ఆయన ప్రతినిధియై యున్నాడు (1 పేతురు 1:11) మరియు ఆయన ద్వారా క్రీస్తు క్రైస్తవుల అంతరంగములో నివసించి యుండును (రోమీయులకు 8:9, 11;

1 కొరింథీయులకు 3:16; 6:19; ఎఫెసీయులకు 2:22; 2 తిమోతి 1:14). పరలోక సంబంధమైన స్వాస్థ్యమును గూర్చి మనకు పరిశుద్ధాత్మ ఒక వాగ్దానముగా, ఒక హామీగా అనుగ్రహింపబడి యున్నాడు (2 కొరింథీయులకు 1:21, 22; ఎఫెసీయులకు 1:13, 14).

ఎవరి "లో"నైతే క్రీస్తు ఉన్నాడో వారి గూర్చిన సందర్భములోని "మీరు" అను పదము బహువచనములో నున్నది. యేసు గుంపులుగా నున్న ప్రజల యందును, వ్యక్తిగతముగాను వారియందుండును. "మహిమ" అని చెప్పినప్పుడు, అది కొలొస్సయులు పొందబోవుచుండిన అంతిమ బహుమానమై యుండినదని పౌలు భావించాడు. క్రైస్తవులు పరలోకమందు నివసించుటకు ఎదురుచూడవచ్చును (2 కొరింథీయులకు 5:1; 1 పేతురు 1:3, 4).

## వారి గూర్చి ఆయన కలిగియుండిన ధ్యేయము: వారు క్రీస్తునందు సంపూర్ణులై యుండవలెను (1:28, 29)

**[28]ప్రతి మనుష్యుని క్రీస్తునందు సంపూర్ణునిగా చేసి ఆయనయెదుట నిలువబెట్టవలెనని, సమస్తవిధములైన జ్ఞానముతో మేము ప్రతి మనుష్యునికి బుద్ధిచెప్పుచు, ప్రతి మనుష్యునికి బోధించుచు, ఆయనను ప్రకటించుచున్నాము. అందునిమిత్తము నాలో బలముగా, కార్యసిద్ధికలుగజేయు ఆయన క్రియాశక్తిని బట్టి నేను పోరాడుచు ప్రయాసపడుచున్నాను.**

### "మేము ఆయనను ప్రకటించుచున్నాము" (1:28)

**మేము** అని చెప్పినప్పుడు, పౌలు తనను మరియు తిమోతిని గూర్చే ప్రస్తావించుచుండెనా, లేక దానిని సంపాదికీయపరమైన ఒక పదముగా వాడుచుండెనా? దీనికి నిశ్చయమైన సమాధానం దొరకుట సాధ్యం కాకపోవచ్చును. వ్రాసేది ఆయన ఒక్కడే అయినా అది, "ఇటువంటి ఆలోచనా ధోరణికి మేము మా అభ్యంతరమును తెలియజేయుచున్నాము" అని ఏ రచయితయైనా చెప్పుచుండు అదే విధమైన అభివ్యక్తీరకణమై యుండవచ్చును. మరొక విధంగా చూచినట్లయితే, 29వ వచనంలో "నేను" అని పౌలు రచించుచున్న పదము ఆయన "మేము" అని రచించినప్పుడు, తానొక్కడి గూర్చే ప్రస్తావించుచుండెనని సూచింపవచ్చును.

పౌలు చేయుచుండిన ప్రబోధములలోను (1 కొరింథీయులకు 2:1, 2), ఇతరుల ప్రచారములలోను యేసే ప్రధానాంశమై యుండెను (అపొస్తలుల కార్యములు 8:5, 35). ప్రాథమిక సందేశము – క్రీస్తు సిలువను గూర్చిన వార్త – వెఱ్ఱితనమై యున్నట్లు లోకమునకు అగుపించినప్పటికిని (1 కొరింథీయులకు 1:18), అది దేవుని "జ్ఞానము" (*sophia*; 1 కొరింథీయులకు 1:24; కొలొస్సయులకు 1:9 కూడ చూడుము) బయలు పరచుటకై ఆధారపడి యున్నది.

ఆయన తన ప్రబోధములను ఎలా ప్రచురము చేయుచుండెనో మరియు ఇతరులను ఎలా హెచ్చరించుచుండెనో, తన వ్యక్తిగత విధానమేమై యుండినదో పౌలు 1 థెస్సలొనీకయులకు 2:3–12లో బయలుపరచాడు. ఆయన ధైర్యము వహించినవాడై యుండెను. సువార్తను వంచనతో పంచలేదు, మనుష్యులను సంతోషపెట్టు వర్తమానములను చెప్పలేదు, ప్రగల్భాలు, తెలియజేయు పలుకులు పలుకలేదు, ఇచ్చకపు మాటలను ఇసుమంతైనా ఉపయోగించలేదు (వచనాలు 3–6). దేవునినే సంతోషపర్చుటకు ప్రయత్నించుచు, తన చంటి బిడ్డకు పాలిచ్చు

తల్లి వలె ఆయన మృదువుగాను, తన బిడ్డల గూర్చి ఆందోళన చెందుచుండు తండ్రిగా శ్రద్ధతోను తన తోటి సహోదరుల యెడల ప్రవర్తించుచుండెను, ఏలయనగా వారు ఆయనకు అత్యంత ప్రియమైనవారై యుండిరి (వచనాలు 7–12). అప్పుడప్పుడు మనఃపూర్వకమైన ఆయన యొక్క ఆందోళన ఆయన చేయుచుండిన మందలింపులనుబట్టి ఆయనను విలపించునట్లు చేసినది (అపొస్తలుల కార్యములు 20:19, 31; 2 కొరింథీయులక 2:4; ఫిలిప్పీయులకు 3:18).

### "ప్రతి మనుష్యునికి బుద్ధిచెప్పుచు, ప్రతి మనుష్యునికి బోధించుచు" (1:28)

**ప్రతి మనుష్యునికి** అని వ్రాయుట ద్వారా, సువార్త యొక్క సార్వజనీనతను పౌలు రూఢిపరచాడు. సువార్తను అందరూ అంగీకరింపకపోయినప్పటికిని. అది ప్రతి ఒక్కరి కొరకును ఉద్దేశింపబడినదై యున్నది, ఏ ఒక్కడును మినహాయింపబడలేదు (రోమీయులకు 10:16; 2 థెస్సలొనీకయులకు 1:8). "మనుష్యుడు" అనగా (*athrōpos*, "మానవ జాతి") ఆ మాటలో స్త్రీలు మరియు పురుషులు కలిసియున్నారు. పురుషులు మాత్రమే అని పౌలు భావించియుండినట్లయితే, ఆయన *anēr,* అనగా 1 కొరింథీయులకు 11:7–9లో ప్రత్యేకించి పేర్కొన్నట్లు "పురుషుడు" అను పదమును ప్రయోగించేవాడే. పౌలు ప్రతి ఒక్కరికి, వారు స్త్రీలైనా లేక పురుషులైనా, సమస్త ప్రజలకు సువార్తను సమస్త జ్ఞానముతో ప్రకటించాడు.

ప్రతి ఒక్కరును క్రీస్తు నిమిత్తము సంపూర్ణంగా అభివృద్ధి చెందవలసియున్నదను అవసరమును పౌలు గుర్తించాడు. ఆయన విశ్వాసుల అవసరములను మాత్రమే కాదు, కానీ అవిశ్వాసుల అవసరముల గూర్చి కూడా ఆందోళన చెందాడు. ఇరువురి గూర్చిన బాధ్యాతాయుతమైన కర్తవ్యము ఆయన కలిగియుండెను: "గ్రీసుదేశస్థులకును గ్రీసుదేశస్థులు కానివారికిని; జ్ఞానులకును మూఢులకును నేను ఋణస్థుడను" అని చెప్పుచున్నాడు (రోమీయులకు 1:14).

**బుద్ధిచెప్పుటలో** ప్రజలను హెచ్చరించుచు అవినీతిమయమైన, ఆధ్యాత్మికము కానిదైన జీవితము జీవించుట, మరియు తప్పుడు **బోధలను** అనుసరించుట వలన కలుగు పర్యవసానములను చూపించవలెనను అభిప్రాయము కూడ కలిసియున్నది. ఈ విషయములను బోధించుటలో నిర్మానాత్మకమును వ్యతిరేకార్థకమునైన ధోరణి కలదు ఏలయనగా క్రైస్తవులు సరైన పనులను మాత్రమే చేయుచు వారి జీవితములో గల తప్పులను తొలగించుకొనుచుండవలెను. నీతియుక్తమైన జీవితము గూర్చి నొక్కి వక్కాణించుచునే, చెడుకు దూరముగా ఉండవలసిన ప్రాముఖ్యతను కూడ పట్టించుకొనవలెను.

"... (చేయ) కూడదు"/"... (చేయ) వద్దు" అని యేసు ఉపదేశించుచుండిన విషయములలో ఆయనకు ఎటువంటి సంకోచమైనను లేదు. కొండ మీద ప్రసంగములో వారు చేయవలసినదేమిటో ఆయన బోధలు వినుచుండిన వారికి తెలియజెప్పాడు, కానీ అదే సమయంలో వారు చేయకూడనివేమిటో కూడా వారికి తెలియజెప్పాడు (మత్తయి 5:34; 6:2, 3, 5, 16, 19, 25, 31, 34; 7:1, 6). క్రైస్తవ్యము అత్యధికంగా నిర్మాణాత్మకమైనదై యున్నది, కానీ అవివేకమును అసభ్యకరమునైన అభ్యాసములలో నిమగ్నమై యుండుటకు వ్యతిరేకమైన హెచ్చరికలు కూడా దానిలో ఉన్నాయి.

యేసు ఉపదేశములు లోక జ్ఞానముపై కాదు (1 కొరింథీయులకు 2:13), కానీ

దేవుని **జ్ఞానముపై** ఆధారపడి యున్నవి. పౌలు దేవుని జ్ఞానమును ప్రకటించాడు (1 కొరింథీయులకు 1:24, 30; 2:7). విన్నవించు ధోరణి గల సంబోధనా పద్ధతుల ద్వారా గాని, మానవ జ్ఞానము ద్వారా గాని శ్రోతలను ఒప్పించుటకు ఆయన వెదకలేదు; ఆయన కేవలము దేవుని సందేశమును ప్రకటించాడు (1 కొరింథీయులకు 2:1-5).

### "ప్రతి మనుష్యుని క్రీస్తు నందు సంపూర్ణునిగా చేసి ఆయన యెదుట నిలువబెట్టవలెనని" (1:28)

పౌలు సువార్తను ప్రకటించుటలోను శ్రోతలను హెచ్చరించుటలోను గల హేతువు తెలియజెప్పబడుచున్నది. మరొకసారి, తరువాతి వచనములో ఉత్తము పురుష ఏకవచనము ("నేను") యొక్క పూర్వావస్థలోనికి వచ్చుటకు మాత్రమే పౌలు ఉత్తమ పురుష, బహు వచనమును (**మేము**) ప్రయోగించాడు. క్రైస్తవులను సంపూర్ణులును పరిపక్వత చెందినవారిగాను అభివృద్ధి చేయునట్లు, బుద్ధిచెప్పుటలోను బోధించుటకును పౌలు ప్రయోగించుచున్న ద్విగుణ విధానము ఆవశ్యకమై యుండినది. ప్రజలు ప్రభువైన క్రీస్తును అంగీకరించి ఆయన యందుండునట్లు వారిని ఒప్పించు (రోమీయులకు 6:3; గలతీయులకు 3:27) వారిని క్రీస్తునందు సంపూర్ణులనుగా అభివృద్ధిచేయుట ప్రబోధకుని పనులలో గల సదుద్దేశమై యున్నది. ఎవరైన ఒకరిని క్రీస్తు నొద్దకు నడిపించుట ఉపదేశకుడుగాని ఉపాధ్యాయుడుగాని కలిగియున్న కార్యభారము యొక్క ప్రారంభము మాత్రమే అయియున్నది. పరిపక్వత దిశగా వెళ్లుచుండు ప్రగతిశీలమైన అభివృద్ధి యేసును వెంబడించుచున్న ప్రతి ఒక్కరి లక్ష్యమై యుండవలెను (ఎఫెసీయులకు 4:11-13; హెబ్రీయులకు 6:1).

**ప్రతి మనుష్యుని క్రీస్తునందు సంపూర్ణునిగా చేసి** ఎప్పుడు లేదా ఎవరి యెదుట ఆయన నిలువబెట్టునో యను విషయాన్ని పౌలు తెలియజెప్పలేదు. బహుశా, తీర్పు దినాన సమస్త జనులు యేసు యెదుట ప్రత్యక్షమగు సమయం కొరకు ఆయన ఎదురుచూచుండెనేమో. యేసు క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు ఆయన వారిని గూర్చి ఆనందించునట్లు ఈ సహోదరులు ప్రతి క్రైస్తవ గుణలక్షణమును అభివృద్ధిచేసికొనుటకు వారికి సహాయం చేయాలన్నదే ఆయన ఆశ మరియు ఆశయమై యుండినది (1 థెస్సలొనీకయులకు 2:19, 20). ఒక వేళ ఎవడైనను నశింపగోరినప్పటికిని (1 కొరింథీయులకు 3:12-15), మరియు ప్రతి క్రైస్తవ వైఖరిని ఏ ఒక్కరైనను పరిపూర్ణముగా పెంపొందించుకొననప్పటికిని, ఆయనకు అప్పగింపబడిన పనిని మాత్రం సఫలీకృతముగా సమాప్తము చేసి అందుకివ్వబడు బహుమానము పొందుకొనుట గూర్చి ఆయన దృఢనిశ్చయముగలవాడై యుండెను.

*Teleios* అను గ్రీకు పదమునకు 28వ వచనంలో "సంపూర్ణులు" అని చేయబడిన అనువాదము, 4:12లో అనువదింపబడి యున్నట్లుగా "సంపూర్ణులు" (*teleioi,* ఇదే మూల పదము నుండి వచ్చినది) కంటె మంచి అనువాదమై యున్నది. ఈ పదము మత్తయి 19:21లో "పరిపూర్ణుడు" అని అనువదింపబడనది కానీ మరొక చోట "పరిపక్వత చెందిన" అని అనువదింపబడినది.[10] ఇతర వాక్యభాగములలో అది "పరిపూర్ణమైన" అని అనువదింపబడినది; కానీ "పరిపక్వతచెందిన" లేక "సంపూర్ణులైన" రెండు కూడ మెరుగైన అనువాదములై యున్నవి. "పరిపూర్ణుడు" అను పదము తప్పుదోవపట్టించునదై యున్నది. మానవజాతి దేవుని యొక్క పరిపూర్ణతను కలిగియుండనేరదు (మత్తయి 5:48). పౌలు

పరిపూర్ణము కానిదానిని, పరిపూర్ణమైనదానితో పోల్చుచు రెంటికిని గల తారతమ్యమును తెలియజెప్పుచుండెను (1 కొరింథీయులకు 13:10). ఏ ఒక్క క్రైస్తవుడైనను పరిపూర్ణుడై యున్నాడని ఆయన నమ్మలేదు (ఫిలిప్పీయులకు 3:15), సరికదా ఎవరైనను పరిపూర్ణులై యుందురని కూడా ఆయన ఆశించలేదు (కొలొస్సయులకు 4:12). క్రైస్తవులు పరిపూర్ణులై యుందురని యాకోబు ఆశించలేదు (యాకోబు 1:4; 3:2). నిస్సందేహంగా, మానవుడు పరిపూర్ణమైన ప్రేమ కలిగియుండునని యోహాను నమ్మలేదు (1 యోహాను 4:18).

ఆధ్యాత్మిక సంపూర్ణత మరియు పరిపక్వమునకు ఒకని అంతరంగమందుండు క్రీస్తు మూలాధారమై యున్నాడు (వచనం 27), మరియు ఆయన మహిమా నిరీక్షణయై యున్నాడు. క్రీస్తునందుండి ఆధ్యాత్మికముగా ఎదిగినవాడై యుండుటకు దైవభక్తి మరియు భయముతో కూడిన జీవితము జీవించుట ద్వారా వ్యక్తము చేయబడు అంతరంగమందలి ఎదుగుదల అవసరమై యున్నది. సంపూర్ణముగా అభివృద్ధిచెందిన క్రైస్తవుడు యేసు ఉపదేశాలలోని ఏ ఒక్క కోణంలోనైనను విశిష్టమైనవాని కంటె ఎక్కువైనవాడై యున్నాడు. వాడు ప్రతి సద్గుణములో ఏ నాటికైనను సంపూర్ణముగా ఎదుగకపోయినప్పటికిని, వాడు ఆధ్యాత్మికముగా, నైతికముగా, సిద్ధాంతపరంగా, మరియు సామాజికంగా క్రైస్తవ జీవితము మరియు సేవ యొక్క అన్ని కోణాల్లో పరిపక్వత చెందినవాడైనట్లయితేనే, వాడు సంపూర్ణముగా ఎదిగినవాడై యున్నాడని పరిగణింపబడును.

### “అందు నిమిత్తము నాలో బలముగా, కార్యసిద్ధి కలుగజేయు ఆయన క్రియాశక్తిని బట్టి నేను పోరాడుచు ప్రయాసపడుచున్నాను” (1:29)

పౌలు పడిన ప్రయాసములో ఒక **ఉద్దేశముండినది.** ప్రతి మనిషిని ప్రభువువైపు మళ్లించి, వారు పరిపక్వత చెందని క్రైస్తవులుగా యుండకుండునట్లు వారిని క్రీస్తు సారూప్యములోనికి తెచ్చుటకు ఆయన అంకితము చేసికొనినవాడై యుండెను (ఎఫెసీయులకు 4:13–15).

**ప్రయాసపడుచున్నాను** అని వ్రాయుట ద్వారా, యేసునకు చేయుచుండిన సేవ సందర్భములో ఆయనకు కష్టము కలిగించుచుండిన కార్యముల గూర్చి పౌలు మాట లాడుచుండెను. **పోరాడుచు** (*agōnizomenos*) అను మాటలో బాధాకరమైన, వేదనతో కూడిన ప్రయాసమున్నదని తెలియుచున్నది. అక్షరాలా పోట్లాటను సూచించుటకును (యోహాను 18:36), అలంకారికంగా, జెట్టియైనవాని పోరాటము (1 కొరింథీయులకు 9:25), మరియు క్రైస్తవ జీవితము (1 తిమోతి 6:12; 2 తిమోతి 4:7) గూర్చి ప్రస్తావించినప్పుడు పౌలు ఈ పదమును ప్రయోగించుచున్నాడు.

“క్రియాశక్తితో నన్ను బలముగా బలపర్చుచున్న ఆయన శక్తితో పోరాడుచున్నాను” అనునది, ఇంకా ఎక్కువైన అక్షరార్థ అనువాదమై యుండును. **శక్తి** (*energeia,* “energy”) అను నామవాచకము మరియు **కార్యసిద్ధికలుగజేయు** (*energoumenēn,* “energizing”) అను అసమాపక క్రియాపదములను ప్రయోగించుట ఉద్దేశపూర్వకమైన శబ్దచమత్కారమై యుండును. రెండు ప్రయోగములు కలిసి పౌలులో కార్యసిద్ధికలుగజేయుచున్న బలము మరియు శక్తి యొక్క మూలాధారము గూర్చి నొక్కివక్కాణించుచున్నవి. పౌలులో పనిచేయుచుండిన శక్తి యేసు నుండి, పరిశుద్ధాత్మ ద్వారా సకల క్రైస్తవులను ఆధ్యాత్మికముగా బలపర్చువాని నుండి, కలుగుచుండినదై యుండినది (ఎఫెసీయులకు 3:16).

**బలముగా** అని అర్థమిచ్చునట్లు అనువదింపబడిన గ్రీకు పదము *dunamis.* పౌలు, ఇతర అపొస్తలుల వలెనే మానవ ప్రాతినిధ్యంలేకుండు, పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందియున్నాడని స్పష్టముగా తెలియుచున్నది. ఈ బాప్తిస్మము ఆయన అద్భుతములు చేయగల శక్తిని ఆయనకు ప్రసాదించినది (2 కొరింథీయులకు 12:12). అపొస్తలుల కార్యములు 1:8 ప్రకారము యేసు అపొస్తలులకు ఏ శక్తిని వాగ్దానం చేసాడో అదే శక్తిని పౌలు కూడ కలిగియుండెను. ఈ "శక్తి" బహుశా ఆధ్యాత్మికమైనదాని కంటె ఎక్కువగా భౌతికమైనదని ఎంచబడకూడదు. పౌలు యొక్క బాహ్య పురుషుడు, అనగా ఆయన శరీరము, బలహీనమైనదగుచుండెను, కానీ ఆయన యొక్క అంతరంగ బలము అంతకంతకు అనుదినము నూతనపరచబడుచున్నదై అధికమగుచుండెను (2 కొరింథీయులకు 4:16).

## అన్వయము

**ఇష్టపడుచుండు దాసులు**

ఆయనను యేసు క్రీస్తునకు ఒక గొప్ప దాసునిగా చేసిన అంకితభావమును పౌలు ప్రదర్శించాడు, మనకు ఒక మంచి మాదిరిని కనుపర్చాడు. ఆయన క్రీస్తును పోలి నడుచుకొన్న ప్రకారము (1 కొరింథీయులకు 11:1), మనము ఆయనను పోలి నడుచుకొనవలెనని ఆయన రచించాడు (1 కొరింథీయులకు 4:16; ఫిలిప్పీయులకు 3:17). "మరియు మీరు నా వలన ఏమి నేర్చుకొని అంగీకరించితిరో, నాయందున్నట్టుగా ఏవి వింటిరో ఏవి చూచితిరో, అట్టివాటిని చేయుడి; అప్పుడు సమాధానకర్తయగు దేవుడు మీకు తోడైయుండును" అంటూ ఆయన ఫిలిప్పీయులను హెచ్చరించాడు (ఫిలిప్పీయులకు 4:9). సంఘమునకు సేవ చేయుచు ప్రతి ఒక్కరిని క్రీస్తునందు సంపూర్ణులనుగా నిలువబెట్టుటకు ప్రయాసపడుటకు ఇష్టపడుచుండు దాసులమై యుండుట ద్వారా మనము పౌలును పోలి నడుచుకొనవచ్చును.

*క్రీస్తు కొరకు మనము కష్టనష్టములను సహించుటకు ఇష్టపడుచున్నవారమై యుండవలెను.* యేసు అననీయకు ప్రత్యక్షమైనప్పుడు, పౌలు యేసు నామము నిమిత్తము ఎన్ని శ్రమలు అనుభవించవలసి యుండునో ఆయనకు చూపించునని యేసు అననీయతో చెప్పాడు (అపొస్తలుల కార్యములు 9:16). పౌలు తన పరిచర్యను ప్రారంభించిన నాటి నుండి కూడ, క్రీస్తు దాసుడుగా ఆయన ఎదుర్కొనవలసియుండిన సమస్యల గూర్చి ఎరిగినవాడై యుండెను. ఇది ఇట్లుండినప్పటికిని, ఆయన అపొస్తలుడుగా ఉండుటకు పిలువబడిన తరువాత యేసుకు విధేయతతో లోబడుచుండుట మానలేదు (అపొస్తలుల కార్యములు 26:19; గలతీయులకు 1:1).

ఆయన సువార్త ప్రకటించుచుండిన సందర్భములలో ఎదుర్కొనిన కొన్ని కష్టములను పౌలు పరోక్షంగా ప్రస్తావించాడు (2 కొరింథీయులకు 6:4–10; 11:23–28). ఈ కష్ట కాలములలో, లోలోపల కూడ మనస్తాపములు, దుఃఖము, మరియు సంఘములన్నిటి గూర్చిన చింత వంటి ఎన్నో పోరాటములను సహితము ఎదుర్కొన్నాడు. "బలహీనతతోను భయముతోను ఎంతో వణకుతోను" అయన వారితో కూడ ఉండెనని వ్రాయుటద్వారా ఆయన కొరింథీలో ఉన్నప్పుడు అనుభూతిచెందుచుండిన ఒత్తిడిని కొరింథులో నున్న క్రైస్తవులకు వ్రాసిన ఉత్తరములో బయలుపర్చాడు (1 కొరింథీయులకు 2:3). పౌలు యొక్క ఆతురతను

అర్థంచేసికొనిన క్రీస్తు, పౌలు కొరింథులో ఉన్నప్పుడు ఆయనకు ప్రత్యక్షమయ్యాడు, ఆయన భయపడాల్సిన అవసరంలేదని పౌలును ప్రోత్సాహించాడు (అపొస్తలుల కార్యములు 18:9, 10). పౌలు ప్రదర్శించిన మాదిరిని మనము అనుకరించినట్లయితే, మనము కూడ "స్థిరులమును, కదలనివారమును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులమునై యుందుము" (1 కొరింథీయులకు 15:58).

పౌలు క్రీస్తు కొరకు జీవించునట్లు, యేసు క్రీస్తు యొక్క ప్రేమ మరియు బలియాగము ఆయనను ప్రేరేపించాయి (గలతీయులకు 2:20). వ్యక్తిగత ప్రోత్సాహకమునుబట్టియే, సువార్తను ప్రకటింపవలసిన భాగ్యముతో కూడిన బాధ్యతాయుతమైన భారము ఆయన మీద ఉన్నదని ఆయన భావించుచు, అది తన కర్తవ్యమై యున్నదను అనుభూతిచెందుచు, ఆయన పయనించిన ప్రతి చోట, ప్రతి ఒక్కరికిని సువార్త ప్రకటించాడు. "గ్రీసు దేశస్థులకును గ్రీసుదేశస్థులు కానివారికిని, జ్ఞానులకును మూఢులకును నేను ఋణస్థుడను. కాగా, నావలననైనంతమట్టుకు, రోమాలోని మీకును సువార్త ప్రకటించుటకు సిద్ధముగా ఉన్నాను" అని ఆయన వ్రాసాడు (రోమీయులకు 1:14, 15).

కర్తవ్యము మరియు విధి క్రైస్తవుల విషయంలో వ్యతిరేకార్థక పదములు కావు. దేవుని చిత్తమును నెరవేర్చుట తన కర్తవ్యమై యుండినదని అనుభూతిని యేసు అనుభవించాడు, ఏలయనగా ఆయన తండ్రి చిత్తమును నెరవేర్చుటకు వచ్చాడు కానీ తన సొంత ఇష్టమును నెరవేర్చుకొనుటకు రాలేదు (యోహాను 4:34; 5:30; 6:38). క్రీస్తును సేవించుట ఆయన కర్తవ్యమై యుండినదని పౌలు నమ్మాడు (రోమీయులకు 1:14; 1 కొరింథీయులకు 9:16). పొలములో పనిచేసిన తరువాత, వాని యజమానుడు ఇంటిలోనికి వచ్చినప్పుడు కూడ ఆయనకు ఉపచారము చేయుటకు వాడు సిద్ధంగా ఉండవలసియుండిన ఒక దాసుని గూర్చి యేసు వివరించాడు. ఈ ఉపమానము నుండి యేసు ఈ క్రింది అభిప్రాయమును వెలిబుచ్చాడు: "అటువలె మీరును, మీకు ఆజ్ఞాపింపబడినవన్నియు చేసిన తరువాత, 'మేము నిష్ప్రయోజకులమైన దాసులము, మేము చేయవలసినవే చేసియున్నామని' చెప్పుడనెను" (లూకా 17:10; NKJV, "మన విధి ఏమైయుండనదో దానినే చేసాము"). మనము మన క్రైస్తవ సేవను గంభీరముగా ఎంచవలసిన అవసరం ఎంతైనా ఉన్నది అప్పుడు మనము చేయవలెనని యేసు ఆశించు విషయముల గూర్చి మనము బాధ్యులమై యుందుము.

*సంఘ సేవ నిమిత్తమై మనలను మనము అర్పించుకొనవలెను.* ఒకరికొకరము సేవ చేయుట క్రైస్తవ జీవితంలోని ఒక ప్రాముఖ్యమైన భాగమై యున్నది (గలతీయులకు 5:13; 1 పేతురు 4:10). పౌలు తన తోటి క్రైస్తవ సహోదరుల నిమిత్తము సంతోషంతోను ఇష్టపూర్వకంగాను తనను తాను సమర్పించుకొన్నాడు. "మరియు మీ విశ్వాస యాగములోను దాని సంబంధమైన సేవలోను నేను పానార్పణముగా పోయబడినను, నేనానందించి మీ యందరితో కూడ సంతోషింతును" అని చెప్పుచున్నాడు (ఫిలిప్పీయులకు 2:17). ఈ విధంగా ఆయన యేసు శ్రమలను సంఘ క్షేమాభివృద్ధి నిమిత్తము సమాప్తము చేయుటకు సకల విధాలా ప్రయత్నించాడు (వచనం 24).

మనము ఈ క్రింది పనులు చేయవలెనని ఆదేశింపబడుచున్నాము:

- గౌరవము విషయములో ఒకని కంటె మరొకడు గొప్పవాడని ఎంచుడి (రోమీయులకు 12:10).
- ఒకరి గూర్చి మరొకరు చింతించుచున్నవారై యుండుడి (1 కొరింథీయులకు 12:25).
- ఒకని నొకడు హెచ్చరించుకొనుచుండుడి (కొలొస్సయులకు 3:16).
- ఒకని నొకడు ఆదరించుకొనుడి (1 థెస్సలొనీకయులకు 4:18).
- ఒకని నొకడు బలపర్చుకొనుడి (1 థెస్సలొనీకయులకు 5:11).
- ఒకనితో నొకడు సమాధానముగా నుండుడి (1 థెస్సలొనీకయులకు 5:13).
- ఒకని నొకడు ప్రోత్సాహించుకొనుడి (హెబ్రీయులకు 3:13).
- ప్రేమించుటకును మంచి పనులు చేయుటకును ఒకని నొకడు ప్రేరేపించుకొనుడి (హెబ్రీయులకు 10:24).
- ఒకని కొరకు మరొకడు ప్రార్థనచేయుడి (యాకోబు 5:16).
- మన తోటి సహోదరుల నిమిత్తము మన ప్రాణములనర్పింతుము (1 యోహాను 3:16).
- ఒకని నొకడు ప్రేమించుడి (1 యోహాను 4:7).

క్రైస్తవులు తోటి ఇతర క్రైస్తవుల గూర్చిన బాధ్యత కలిగియున్నారు. "సంఘము నాకేమి చేయుచున్నది?" అనునది మన ప్రశ్నయై యుండకూడదు. అనేక మంది క్రైస్తవులలో ఈ వైఖరి ప్రస్ఫుటమగుచున్నది. "నేను ఇతరులకు ఏమి చేయుచున్నాను?" అనునదే మన ప్రశ్నయై యుండవలెను. యేసు ప్రదర్శించిన వైఖరి యిది. "తన పొరుగువానికి క్షేమాభివృద్ధి కలుగునట్లు, మనలో ప్రతివాడును మేలైనదానియందు అతనిని సంతోషపరచవలెను; క్రీస్తు కూడ తన్నుతాను సంతోషపరచుకొనలేదు గాని, 'నిన్ను నిందించువారి నిందలు నా మీద పడెను' అని వ్రాయబడియున్నట్లు ఆయనకు సంభవించెను" (రోమీయులకు 15:2, 3).

ఆయనను వెంబడించువారిలో ఇతరులను సేవించువారే అత్యంత గొప్పవారని యేసు ఉపదేశించాడు (మత్తయి 20:26; 23:11). వారు ఇతరులకు సేవచేయుచున్నవారగునట్లు, క్రైస్తవులందరు కూడ, క్రీస్తునకు వలెనే, తమ్మును తాము తగ్గించుకొనవలెను (ఫిలిప్పీయులకు 2:6-8). యేసు మతమే సేవ మనస్తత్వమై యున్నది.

*మనకు పరిచయమున్న ప్రతి ఒక్కరిని సంపూర్ణులనుగా క్రీస్తు యెదుట నిలువబెట్టుటకు మనము ప్రయాసపడుదుము.* మనందరిలోను మంచి గుణగణములున్నవి, కానీ అదే సమయంలో బలహీనతలు కూడ ఉన్నవి. ఎల్లవేళలందును యేసును ప్రేమించుచు ఆయనను సేవించు జీవితములను అభివృద్ధి చేసికొనవలెననునది విలువైన ధ్యేయమై యున్నది.

క్రైస్తవులముగా, మనము కూడ "ప్రతి భారమును, సుళువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టవలెనని" ప్రోత్సాహింపబడుచున్నాము (హెబ్రీయులకు 12:1-2). మనము పరిపక్వత చెందని శిశువులముగా నిలిచియుండరాదు, కానీ ప్రాథమికమైన నియమములను మించిన క్రీస్తు నందలి పరిపక్వతను వెదకవలసినవారమై యున్నాము (హెబ్రీయులకు 5:12-6:2).

కొలొస్సయులకు 1:28లోని "సంపూర్ణులు" అను పదమునకు గ్రీకులో నున్న *teleios,*

"పరిపక్వతచెందిన" అని ఎఫెసీయులకు 4:13లో అనువదింపబడిన అదే గ్రీకు పదమై యున్నది. ఇదే పదము "పరిపూర్ణులు" అని కూడ అనువదింపబడినది (KJV; NKJV). సమస్త ప్రజలలో సంపూర్ణత నివసింపవలెనని పౌలు కోరాడు, అనగా యేసు యొక్క పరిపూర్ణమైన స్వభావము లోనికి వారు అభివృద్ధిచెందవలెనని భావించాడు (ఎఫెసీయులకు 4:13). మనము మన జీవితములకు సకల క్రైస్తవ సద్గుణములను చేర్చుకొనుచు, ప్రతి ఒక్కరు యేసు నిమిత్తము సంపూర్ణముగా అభివృద్ధిచెందిన జీవితములను పెంపొందించుకొనునట్లు ఒకరికొకరము సహాయము చేసికొనవలెను (గలతీయులకు 5:22, 23; 2 పేతురు 1:5-7). ఈ విధంగా మనము క్రీస్తునందు సంపూర్ణులమౌదుము.

మనము క్రీస్తునకు మరి ఎక్కువగా సమర్పించుకొనినవారమై యుండుటకును, మన జీవితములో క్రీస్తు లక్షణమును అభివృద్ధి చేసికొనుటకును ఒకరి నొకరము ప్రోత్సాహించుకొనవలెను. ఇట్టి పరిస్థితులలో మనము పాపిష్ఠియైన జీవితముల గూర్చి ఒకరి నొకరము గద్దించుకొనుచు, యేసునకు ఉత్తమమైన సేవలనందించునట్లు ఒకరి నొకరము ప్రోత్సాహించుకొనవలసిన అవసరమేర్పడవచ్చును.

**శ్రమలయందును సేవచేయుట (1:24-26)**

పౌలు మనస్సులో యేసు మరియు ఆయన సంఘము ప్రథమ స్థానాన్ని ఆక్రమించుకొని యుండినవి, గనుక ఆయన ఈ రెండు విషయముల నిమిత్తము తనను తాను సంపూర్ణముగా సమర్పించుకొనుటకు సముఖుడై యుండెను. యేసు నిమిత్తము ఎన్నో శ్రమలు ఎదుర్కొని తన ప్రాణాన్ని పానార్పణముగా పోయవలసి యుండునని ఎరిగియుండి కూడ ఆయన యేసునే సేవించుటకు ఆశించాడు. పౌలు క్రైస్తవులకు ఒక మంచి మాదిరియై యున్నాడు (1 కొరింథీయులకు 11:1). పౌలు జీవితము మరియు ఆయన చెప్పిన ఉపదేశముల నుండి మనమేమి నేర్చుకొనగలము?

పౌలు క్రీస్తు శ్రమలలో పాలుపంచుకొన్నాడు (వచనం 24). క్రైస్తవులు ఎటువంటి హింసలనైనను ఎదుర్కొనవలసిన అవసరంలేదని యేసు వారికి ఎన్నడును వాగ్దానమీయలేదు. దీనికి విరుద్ధంగా, ఆయన కొరకు జీవించగోరువారికి హింసలే వాగ్దానమీయబడినవి (2 తిమోతి 3:12). ఈ హేతువునుబట్టియే, మనము వ్యతిరేకతను ఎదుర్కొనవలసి యుండునని ఎదురుచూడవలెను (1 పేతురు 4:12). ఇటువంటి సందర్భములలో మనకు హాని చేయువారిని మనము దీవించవలెనే కానీ, శపించకూడదు, సరికదా వారి మేలు కొరకు ప్రార్థించవలెను (మత్తయి 5:44; రోమీయులకు 12:14). సహనముతో శ్రమనొందుట గూర్చి యేసు మనకు అసలైన మాదిరియై యున్నాడు (1 పేతురు 2:21).

క్రీస్తునకు వలెనే, శరీరము నిమిత్తము, అనగా సంఘము నిమిత్తము పౌలు ఇష్టపూర్వకంగా శ్రమలనెదుర్కొన్నాడు (వచనం 24). మనము కూడ, క్రైస్తవులముగా, మన మనస్సుల్లో సంఘమునకు అత్యంత ప్రాధాన్యమైన స్థానమునీయవలెను. ఈ క్రమంలో మనము ప్రార్థించుచుండవలెను, నేర్పించుటకు ప్రయాసపడవలెను, ధనమును సరైన విధంగా ఉపయోగించవలెను, జీవితములు సక్రమమైనవై యుండునట్లు చూచుకొనవలెను. ఏ సమయంలోనైనను, సంఘమును నిందపాలుజేయునట్లు ఏ క్రైస్తవుడును జీవించకూడదు. యేసు సంఘము కొరకు సమర్పించుకొన్న విధంగానే, మనము కూడ సంఘ క్షేమాభివృద్ధి

నిమిత్తము మనలను మనము సమర్పించుకొనుటకు ఇష్టపడుచున్నవారమై యుండవలెను (ఎఫెసీయులకు 5:25-27; 1 యోహాను 3:16).

ఆయన ఎదుర్కొనుచుండిన శ్రమలు ఒక విధంగా గృహనిర్వాహకత్వములోని అంశమై యున్నదని పౌలు పరిగణించాడు (వచనాలు 25-26). ఆయన యేసు కొరకు పని చేయుచుండెనని అర్థంచేసికొన్నాడు. ఆయన తనకివ్వబడిన సమయము, సిరిసంపదలు, మరియు తలాంతుల విషయంలో కేవలము నమ్మకమైన ఒక గృహనిర్వాహకుడై యుండెను. క్రైస్తవులు కూడ ఇదే ధోరణిలో ఆలోచించుటకు నేర్చుకొనవలెను. మన గృహములు, బ్యాంకు ఖాతాలు, మరియు ఆస్తిపాస్తులు సమస్తమును యేసునకు చెందినవే. మనమేమైయున్నామో, మనమేమేమి కలిగియున్నామో, సమస్తమును ఆయనవే. మనము పొందిన దీవెనలను యేసు కొరకు, మన శాయశక్తులా, ఉపయోగించవలెను.

ఆదివారంనాటి ఆరాధనా సమయంలో కానుకలు సేకరింపబడునప్పుడు వారు ఎంతో కొంత మొత్తమును కానుకగా అర్పించుకొనుటతో, యిక మిగిలిన డబ్బంతా వారి సొంతం కొరకే వారికిష్టమైన రీతిలో వాడుకొనుటకు ఇవ్వబడినదని కొంతమంది క్రైస్తవులు అనుకొనుచున్నట్లు అగుపించుచున్నది. దేవుడు మన కానుకలు మాత్రమే చూడడు, కానీ మనకున్న సమస్తమును మనమెలా సద్వినియోగము చేసికొనుచున్నామో కూడ గమనించును.

**ఇతరులను రక్షణ లోనికి నడిపించుట (1:26-28)**

ఒక మర్మమును తెలియపరచుటకు పౌలు ఎంతో ప్రయాసపడ్డాడు (వచనాలు 25-27). పాత నిబంధన ప్రకారము, దేవుని రక్షణ ప్రణాళిక తెలియబడలేదు. క్రొత్త నిబంధన దానిని బయలుపరచునంత వరకు అదొక మర్మముగానే నిలిచిపోయినది (ఎఫెసీయులకు 3:3-5). సమస్త మానవాళిని రక్షించి దానిని సమైక్యపరచుటకు దేవుడు వేసిన ప్రణాళికను ఇతరులు గ్రహించునట్లు వారికి సహాయం చేయవలెనని పౌలు ప్రయాసపడ్డాడు. ప్రతి క్రైస్తవ విశ్వాసి యొక్క లక్ష్యము కూడా ఇదే అయియుండవలెను. ఈనాడు సహితము, ఒకడు రక్షణ పొందుకొనుటకు కావలసిన వాటి గూర్చి గ్రహించలేకపోతున్నవారికి పరిశుద్ధ బైబిలు ఒక మర్మముగానే మిగిలియున్నది. వారు రక్షణ పొందుకొనుటకు దేవుడు కోరుచున్న వాటి గూర్చి ఇతరులు తెలిసికొనునట్లు, యేసు క్రీస్తును వెంబడించుచున్నవారు వారికి సహాయము చేయుటకు ప్రయత్నించవలెను.

ఇంతేగాక, ఇతరులు క్రీస్తునందు సంపూర్ణులగునట్లు వారికి సహాయము చేయుట కూడ పౌలు లక్ష్యమై యుండెను (వచనం 28). ప్రజలు క్రైస్తవ జీవితమును ప్రారంభించుటకు వారిని నడిపించుట మాత్రమే కాదు, కానీ వారు పరిపక్వతచెందిన విశ్వాసులై, క్రీస్తును విశ్వాసనీయముగా వెంబడించువారి గుణగణములను పెంపొందించుకొనునట్లు వారికి తోడ్పడుట కూడ పౌలు యొక్క సదుద్దేశమై యుండినది. క్రైస్తవులు, ఇతరులు యేసును పోలినవారుగా ఎదుగునట్లు వారిని ప్రోత్సాహించుటకు నియమింపబడినవారై యున్నారు. ఇది ముఖ్యముగా సంఘములో నాయకులైయున్నవారి బాధ్యత, పరిశుద్ధులకు తెలియపర్చుచు, వారిని బలపర్చుచు, వారు పరిపక్వమైన దశలోనికి ఎదుగునట్లు చూడవలసినవారి బాధ్యతయై యున్నది (ఎఫెసీయులకు 4:11-13). క్రీస్తు యేసు కలిగియున్న గుణగణములను పెంపొందించుకొనుట, క్రీస్తు నందు సంపూర్ణులమగుటకు గల మార్గమై యున్నది.

**ఇతరులకు ఉపచారము చేయుట (1:29)**

క్రీస్తునకు చేయబడు సేవలో ఇతరులకు చేయబడు ఉపచారము కూడ కలదు, యేసు మరియు పౌలు కూడ ఇతరులకు ఉపచారము చేసినవారే. చివరి రాత్రి/ప్రభువు రాత్రి భోజనము తరువాత, వారిలో ఎవడు గొప్పవాడై యున్నాడో అను అంశము గూర్చి అపొస్తలులు తర్కించుకొనుచుండిరి (లూకా 22:24–27). పరులకు పరిచర్యచేయువాడై అందరి కంటె గొప్పవాడై యున్నాడని వారికి నేర్పించునట్లు యేసు వారికొక మాదిరిని చూపించాడు (యోహాను 13:1–15). ఒక దాసుని/బానిసయైనవాని పని చేయుటకు యేసు తనను తాను తగ్గించుకొని ఆయన అపొస్తలుల పాదములు కడిగాడు. యేసును మరియు ఇతరులను ఏకమనస్సుతో సేవించువారే యేసు యొక్క అతి గొప్ప అపొస్తలులై యున్నారు.

పౌలు తన సొంత ప్రయాసమును వర్ణించాడు (వచనం 29). ఆయన ఇతరుల కంటె ఎక్కువగా ప్రయాసపడ్డాడు, శ్రమలను సహించాడు (1 కొరింథీయులకు 15:10; 2 కొరింథీయులకు 11:23–28). మున్ముందుండిన తీర్పు, ప్రభువునందలి భయము, యేసుక్రీస్తు ప్రేమ, మరియు యేసు అతని కొరకు సిలువమీద మరణించుట మొదలగు వాస్తవములనుబట్టియే, క్రీస్తును సంతోషపర్చవలెనను కోరికతో కూడిన ప్రేరేపణ ఆయనను ముందుకు నెట్టుచుండినది (2 కొరింథీయులకు 5:14, 15; గలతీయులకు 2:20). పౌలు ఇంత సమర్పణాపూర్వకమైన సేవను చేయుటకు గల హేతువు గూర్చి యోచించుట ద్వారా, ప్రతి క్రైస్తవుడు వాని వాని ప్రత్యేకమైన సేవా ప్రణాళికను నెరవేర్చుటకు ప్రేరేపింపబడగలడు (రోమీయులకు 12:6–8).

**దేవుడనుగ్రహించు శక్తితో సేవించుట (1:29)**

దేవుడు పౌలు ద్వార తన పనిని కొనసాగించుచుండెను (వచనం 29). సమస్త కార్యములను దేవుడే చేసినట్లయితే, మానవ ప్రాతినిధ్యం యొక్క అవసరమే ఉండదు. ఏదిఏమైనా, దేవుడు, మహిమాన్వితమైన ఈ సువార్తను క్రైస్తవుల హస్తములలో ఉంచాడు (2 కొరింథీయులకు 4:7). ఆయన తన పనులు చేయుటకును ఆయన వాక్యము ఇతరులకు అందజేయబడునట్లును పనికివచ్చు పనిముట్లము మనమే (1 కొరింథీయులకు 3:5–9). క్రైస్తవులమైన మనము సైనికుల వలె యుద్ధ ప్రతిపదికన ముందడుగు వేయుచు ఆయన సందేశమును సర్వలోకమునకు మోసికొనిపోవుట యేసు ఇచ్చిన ఆజ్ఞయై యున్నది (మత్తయి 28:19; మార్కు 16:15, 16). ఇష్టపూర్వకముగా ఆయనకు లోబడువారిని ఆయన బలపర్చును (ఫిలిప్పీయులకు 4:13). యేసును సేవించుటకు అందుబాటులో నుండు ప్రతి అవకాశమును క్రైస్తవులు గంభీరముగా ఎంచుచు దానిని చేజిక్కించుకొనవలెను. ఆయన ఆరంభించిన మహత్తైన బృహత్కార్యము, నశించినవారిని వెదకి రక్షించుట, సంపూర్తి చేయబడుటకు ఆయనను వెంబడించుచున్నవారిపై దేవుడు ఆధారపడుచున్నాడు.

---

సూచనలు

[1]William Hendriksen, *Exposition of Colossians and Philemon,* New Testament Commentary (Grand Rapids, Mich.: Baker Book House, 1964), 86. [2]H. C. G. Moule, *The Epistles to the Colossians and to Philemon,* The Cambridge Bible for Schools and Colleges (Cambridge: University

Press, 1893; reprint, 1902), 90. [3]Eduard Schweizer, *The Letter to the Colossians: A Commentary,* trans. Andrew Chester (Zurich: Benziger Verlag, 1976; reprint, Minneapolis: Augsburg Publishing House, 1982), 105-6. [4]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 230. [5]రోమీయులకు 1:1; 1 కొరింథీయులకు 1:1; 2 కొరింథీయులకు 1:1; గలతీయులకు 1:1; కొలొస్సయులకు 1:1; 1 తిమోతి 1:1; 2 తిమోతి 1:1 చూడుము. [6]అపొస్తలుల కార్యములు 13:46; 14:25; 15:35, 36; 16:32; 17:13; 18:5, 11; 1 కొరింథీయులకు 15:2; ఫిలిప్పీయులకు 1:14; 1 థెస్సలొనీకయులకు 2:13 చూడుము. [7]J. B. Lightfoot, *St. Paul's Epistles to the Colossians and to Philemon,* rev. (London: Macmillan & Co., 1916), 166. [8]రోమీయులకు 11:25; 16:25; 1 కొరింథీయులకు 2:7; 4:1; ఎఫెసీయులకు 1:9; 3:3–11; కొలొస్సయులకు 1:27; 4:3 చూడుము. [9]ఆదికాండము 22:18; 26:4; 28:14; 49:10; కీర్తనలు 72:8; యెషయా 2:2, 3; 54:2, 3; 60:1–3; మీకా 4:1, 2; మలాకీ 1:11 చూడుము. [10]ఈ పదము 1 కొరింథీయులకు 2:6; 14:20; ఎఫెసీయలకు 4:13; హెబ్రీయులకు 5:14లో "పరిపక్వత చెందినవారు" అని అనువదించబడినది. మత్తయి 5:48; రోమీయులకు 12:2; 1 కొరింథీయులకు 13:10; ఫిలిప్పీయులకు 3:15; కొలొస్సయులకు 4:12; హెబ్రీయులకు 9:11; యాకోబు 1:4, 17, 25; 3:2; 1 యోహాను 4:18లో "పరిపూర్ణులు" అని అనువదించబడినది.